ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 21.0
ANDHRAJYOTHY
5
నారాయణపేట
జిల్లా వార్తలు
శుక్రవారం 5 డిసెంబరు 2025





అరచేతిలో ప్రచార అస్త్రం
● కాలం చెల్లిన వాల్‌రైటింగ్, బ్యానర్లు
● సోషల్ మీడియాకు పెరిగిన ప్రాధాన్యం
● ఎవరికి వారు వేర్వేరు వాట్సాప్ గ్రూపులు
7

అమ్మ కడుపుపై..
కత్తెర గాట్లు

● ఏడాదిలో ప్రైవేటులో సిజేరియన్లు 3,323, సాధారణ కాన్పులు 1,609
● విచ్చలవిడిగా ఫీజు వసూలు
● అమలుకాని ఈ బర్త్ పోర్టల్
● దృష్టి సారించని వైద్య ఆరోగ్యశాఖ

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో పెరుగుతున్న సిజేరియన్ ఆపరేషన్లు



మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నవ మాసాలు మోసి, సుఖ ప్రసవం కావలసిన తల్లుల కడుపుపై కత్తెర గాట్లు పడుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు కాసులకు కక్కుర్తి పడి, 80 శాతం వరకు సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్నారు. విచ్చలవిడిగా ఫీజులు దండుకుంటున్నారు. సిజేరియన్ ఆపరేషన్లను అరికట్టేందుకు ప్రవేశపెట్టిన ఈ బర్త్ పోర్టల్ జిల్లాలో అమలు కావడం లేదు.

నార్మల్ డెలివరీ చేస్తామని నమ్మబలికి..

జిల్లాలో ఒక జనరల్ ఆసుపత్రి, 3 కమ్యూనిటీ ఆసుపత్రులు, 28 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 210కి పైగా ప్రైవేటు నర్సింగ్ హోంలు, ఆసుపత్రులు ఉన్నాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో 7,681 కాన్పులు జరిగాయి. అందులో సాధారణ కాన్పులు 4,455 కాగా, సిజేరియన్ కాన్పులు 3,226 ఉన్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో 4,932 కాన్పులు జరగగా, అందులో సాధారణ కాన్పులు 1,609 కాగా, సిజేరియన్ ఆపరేషన్లు 3,323 చేశారు. ఆసుపత్రికి వచ్చిన తర్వాత నార్మల్ డెలివరీ చేస్తామని నమ్మబలికి, ఏదో కారణం చెప్పి, సిజేరియన్ ఆపరేషన్ చేస్తున్నారు.

కాసుల కోసం కక్కుర్తి..

ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నాయి. ఒక్కో సిజేరియన్ ఆపరేషన్‌కు ఒక్కో ఆసుపత్రిలో ఒక్కో రేటు ఫిక్స్ చేశారు. స్థాయి పెద్దగా ఉన్న ఆసుపత్రిలో రూ. 60 వేల నుంచి రూ. 70 వేల వరకు ఉండగా, చిన్న ఆసుపత్రుల్లో రూ. 40 వేల నుంచి రూ. 50 వేల వరకు వసూలు చేస్తున్నారు. అందులో మందులు, ల్యాబ్ ఫీజులు అదనంగా రూ. 10 వేల నుంచి రూ. 15వేల వరకు తీసుకుంటున్నారు.


మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి

కాసుల కోసం కక్కుర్తి..

ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నాయి. స్థాయి పెద్దగా ఉన్న ఆసుపత్రిలో ఫీజు రూ.60 వేల నుంచి రూ. 70 వేల వరకు ఉండగా, చిన్న ఆసుపత్రుల్లో రూ. 40 వేల నుంచి రూ. 50 వేల వరకు వసూలు చేస్తున్నారు. మందులు, ల్యాబ్ ఫీజులు అదనంగా రూ. 10 వేల నుంచి రూ. 15వేల వరకు తీసుకుంటున్నారు.

అమలుకాని ఈ బర్త్ పోర్టల్

ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ ఆపరేషన్లను నిరోధించేందుకు, సాధారణ కాన్పులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ బర్త్ పోర్టల్‌ను అమల్లోకి తెచ్చింది. ఆసుపత్రుల్లో ప్రతీ రోజు జరిగే కాన్పుల వివరాలను ఎప్పటికప్పుడు ఈ పోర్టల్‌లో నమోదు చేయాలి. పుట్టిన బిడ్డ వివరాలు, ఆపరేషన్ ఎందుకు చేయాల్సి వచ్చింది, మాతా, శిశు మరణాలు వంటి అన్ని వివరాలు ఆ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కాని జిల్లాల అమలు కావడం లేదు.

కొరవడిన పర్యవేక్షణ..

సిజేరియన్ కాన్పులపై జిల్లాలో పర్యవేక్షణ కొరవడింది. 80 నుంచి 100 శాతం సిజేరియన్లు చేస్తున్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలు చేసి ఏ ఒక్క ఆసుపత్రిపై చర్యలు తీసుకున్న దాఖలాలు రెండు, మూడేళ్లుగా లేవు. గత ఏడాది సిజేరియన్ ఆపరేషన్లు ఎక్కువ చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రులకు రాష్ట్ర యంత్రాంగం నోటీసులు జారీచేసినా చర్యలు మాత్రం తీసుకోలేదు. ఇది ఇలాగే కొనసాగితే మాతాశిశు మరణాలు కూడా పెరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ల్యాండ్ రికార్డు ఏడీ ఇంట్లో
ఏసీబీ సోదాలు


లక్ష్మీనగర్ కాలనీలోని శ్రీనివాసులు నివాసంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

● పాలమూరులో 4, నారాయణపేటలో 3 ప్లాట్లు.. రైస్ మిల్లు ఉన్నట్లు గుర్తింపు
● పెద్ద ఎత్తున బంగారు, వెండి నగలు, నగదు కూడా..

మహబూబ్‌నగర్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని రెవెన్యూ ల్యాండ్ రికార్డు ఏడీ కొత్తం శ్రీనివాసులు ఇంట్లో ఏసీబీ అధికారులు గురువారం సోదాలు చేశారు. ఏకకాలంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో సోదాలు చేయగా, ఇందులో భాగంగా మహబూబ్‌నగర్‌లోని ఆయన నివాసం, నారాయణపేట జిల్లాలోని మక్తల్ సమీపంలో ఉన్న గుడెబల్లూరు రైస్‌మిల్లులో రెండు బృందాలు సోదాలు చేశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు కొనసాగాయి. లక్ష్మీనగర్ కాలనీలోని ఆయన నివాసంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. మహబూబ్‌నగర్‌కు చెందిన ఈయన కొంతకాలంలో ఇక్కడి కలెక్టరేట్‌లో సర్వేయర్‌గా పనిచేశారు. తరువాత పదోన్నతిపై ఏడీగా రంగారెడ్డి జిల్లాలో పని చేస్తున్నారు. తనిఖీల్లో మహబూబ్‌నగర్‌లో నివాసంతో పాటు నాలుగు ప్లాట్లు, నారాయణపేటలో 3 ప్లాట్లు ఉన్నట్లు తేలింది. రైస్‌మిల్లు కూతురు పేరిట ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటితోపాటు కర్ణాటక, అనంతపూర్‌లలో 22 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. పెద్దఎత్తున బంగారు, వెండి నగలు, నగదు గుర్తించారు.

రెండోరోజు ఊపందుకున్న నామినేషన్లు

● రెండు రోజుల్లో 110 సర్పంచ్ స్థానాలకు 156, 994 వార్డులకు 284 నామినేషన్లు

నారాయణపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మక్తల్ నియోజకవర్గంలోని 110 గ్రామ పంచాయతీలకు రెండో రోజు వరకు 156 నామినేషన్లు, 994 వార్డు స్థానాలకు 284 నామినేషన్లు వచ్చాయి. మండలంలోని 8 క్లస్టర్లలో రాత్రి పదిన్నర గంటల వరకు అందిన సమాచారం మేరకు 39 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు 49 నామినేషన్లు రాగా, 340 వార్డు స్థానాలకు 162 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు. తొమ్మిదో క్లస్టర్‌లో నామినేషన్లు ఇంకా కొనసాగుతున్నట్లు ఆయన చెప్పారు.

మూడో విడతలో రెండో రోజు వచ్చిన నామినేషన్ల వివరాలు

మండలం	గ్రా.పం	సర్పంచ్	వార్డు
1. కృష్ణ	13	33	63
2. మాగనూర్	16	08	23
3. మక్తల్	39	14	26
4. నర్వ	19	10	15
5. ఊట్కూర్	23	31	91
మొత్తం	110	96	218

పోస్టల్ బ్యాలెట్ల వినియోగంపై శిక్షణ

● పాల్గొన్న మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ల జారీ, పంపిణీలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి అధికారులను ఆదేశించారు. జిల్లాలో గ్రామ పంచాయతీ మొదటి దశ ఎన్నికలు ఈ నెల 11న నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్, స్టేజ్-1 రిటర్నింగ్(ఆర్‌వోఎస్), జోనల్ అధికారులతో ప్రత్యక్షంగా, వెబెక్స్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి దశ ఎన్నికలు జరిగే గండీడ్, నవాబ్‌పేట్, రాజాపూర్, మహమ్మదాబాద్, మహబూబ్‌నగర్ మండలాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్న పొరపాటు కూడా తీవ్రమైన సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల పంపిణీని అత్యంత శ్రద్ధతో, పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. రక్షణ దళాల్లో పనిచేస్తున్న సర్వీస్ ఓటర్ల పోస్టల్ బ్యాలెట్లు గురువారం సాయంత్రంలోపు తప్పనిసరిగా పంపాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జిల్లా పోస్టల్ బ్యా లెట్ నోడల్ అధికారిచ హార్టికల్చర్ డీడీ వే ణుగోపాల్, మాస్టర్ ట్రైనర్ శ్రీకాంత్, స్టేజ్-1 అధికారులు పాల్గొన్నారు.

తొలి విడత
ప్రచారం ఆరంభం

● గ్రామాల్లో వేడెక్కిన రాజకీయం

నారాయణపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల మహా సంగ్రామానికి సంబంధించి తొలి విడత ఎన్నికల ప్రచారం గురువారం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 11న పోలింగ్ జరుగనుంది. అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు. దాంతో ఆయా గ్రామాల్లో రాజకీయం వేడెక్కింది. జిల్లాలోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి, మద్దూర్, కొత్తపల్లి, గుండుమాల్ మండలాల పరిధిలో గల 67 గ్రామ పంచాయతీలకు మొదటి విడతలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అందులో 13 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. రెండో విడత కింద నారాయణపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గల 110 గ్రామ పంచాయతీలు, 994 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. వీటికి శనివారం ఉపసంహరణ గడువు ఉంది.

మూడో విడత నామినేషన్ల స్వీకరణ నేడు ముగింపు

మూడో విడతలో మక్తల్ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గల 110 పంచాయతీలు, 994 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. వాటికి శుక్రవారంతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగియనుంది. ఆశావహులు అధిక సంఖ్యలో నామినేషన్లు వేసేందుకు సిద్ధమయ్యారు.

రూ.15 లక్షలు.. 20 లక్షలు.. 30 లక్షలు
● సర్పంచు పదవికి పోటాపోటీ వేలం
7



పిచ్చుకలు వాలె..
చిగురాకుల వలె..

ఒక్క ఆకూ లేకుండా మోడు వారిన చెట్టు.. సాయం సంధ్య వేళ పిచ్చుకలు గూటికి చేరే ముందు ఆటవిడుపు... కొమ్మ కొమ్మపై వాలి ఎండిన చెట్టుకు కొత్త అందాలు దిద్ది.. చిగురుటాకులను తలపిస్తూ, కనువిందు చేసిన ఈ దృశ్యం మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలంలోని కేశ్వాపూర్ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రం వద్ద గురువారం కనిపించింది. 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి ఫొటోజర్నలిస్టు, మహబూబ్‌నగర్

1,021
మహబూబ్‌నగర్ జిల్లాలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల సంఖ్య ఇది

● మొదటి విడత పోలింగ్ కోసం మూడు చెక్‌పోస్టుల ఏర్పాటు
● 16 ఎస్ఎస్‌టీ, 2 ఎఫ్ఎస్‌టీ బృందాల పర్యవేక్షణ


నంచర్లగేట్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు

మహబూబ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మూడు విడతలకు సంబంధించి 1021 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. 110 సమస్యాత్మక గ్రామాల్లో వాటిని గుర్తించి, పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో 325 గ్రామాలు ఉండగా, అందులో 2,755 సాధారణ పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు గుర్తించారు. అందులో మొదటి విడతలో 29 సమస్యాత్మక గ్రామాలు, 294 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. రెండో విడతలో 36 గ్రా మాలు, 326 పోలింగ్ కేంద్రాలు, మూడో విడతలో 43 గ్రామాలు, 385 పో లింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు.

బందోబస్తులో..

జిల్లాలో ఎన్నికల బందోబస్తు కోసం 1051 మంది పోలీసులు విధులు నిర్వర్తించనున్నారు. ఎస్పీతోపాటు ఇద్దరు అదనపు ఎస్పీలు, 5 మంది డీఎస్పీలు, 20 మంది సీఐ, ఆర్ఐలు, 73 మంది ఎస్ఐలు, 199 మంది ఏఎస్ఐలు, 550 మంది కానిస్టేబుల్స్, 201 మంది హోంగార్డులు ఎన్నికల బందోబస్తులో పాల్గొనున్నారు.

మూడు చోట్ల చెక్‌పోస్టులు

ఎన్నికల బందోబస్తుతో పాటు నగదు పంపిణీ, డబ్బు రవాణా, ఎన్నికల నియమావళి అమలును పర్యవేక్షించేందుకు 16 ఎస్ఎస్‌టీ(స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్), 2 ఎఫ్ఎస్‌టీ(ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్) బృందాలను నియమించారు. మొదటి వి డత ఎన్నికలు జరిగే మండలాల పరిధిలో 3 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. గండీడ్ మండల పరిధిలోని నంచర్ల, బాలానగర్ టోల్‌గేట్, నవాబ్‌పేట మండలం వల్లూరు దగ్గర చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు.


సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్

ఎన్నికల సామగ్రి పంపిణీ పర్యవేక్షణ

నారాయణపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి విడత పోలింగ్ సామగ్రి పంపిణీని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ గురువారం పర్యవేక్షించారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని శ్రీదత్త బృందావన్ బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. తొలి విడత ఎన్నికలు జరిగే కోస్గి, కొత్తపల్లి, గుండుమల్, మద్దూరు మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక కోసం అవసరమైన బ్యాలెట్ పేపర్లు, బాక్సులు, ఇతర సామగ్రి సరిగ్గా ఉన్నాయా? అని కలెక్టర్ సంబంధిత అధికారిని అడిగి తెలుసుకున్నారు. బ్యాలెట్ పేపర్లను పరిశీలించారు. రెండు, మూడో విడత ఎన్నికల కోసం సిద్ధం చేస్తున్న బ్యాలెట్ పేపర్లను కూడా చూశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, డీపీవో సుధాకర్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, మద్దూరు, గుండుమాల్ ఎంపీడీఓ పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణను నిశితంగా పరిశీలించాలి

● మైక్రో అబ్జర్వర్ల శిక్షణలో ఎన్నికల పరిశీలకురాలు సీతాలక్ష్మి

నారాయణపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతీ అంశాన్ని నిశితంగా పరిశీలించాలని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకురాలు సీతాలక్ష్మి మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు తూచ అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సూక్ష్మ స్థాయిలో పరిశీలన జరిపేందుకు వీలుగా నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల సాధారణ పరిశీలకురాలు సీతాలక్ష్మి శిక్షణ కార్యక్రమానికి హాజరై మైక్రో అబ్జర్వర్లకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లను అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు ప్రభావితం చేయకుండా నిఘా ఉంచాలని, ఎన్నికల సంఘం గుర్తింపు కార్డులు కలిగిన వారు, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న వారు మినహా ఇతరులెవరిని పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. కరదీపికలోని అంశాలను చదివి తదనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. డీపీవో సుధాకర్‌రెడ్డి, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ విజయ్ కుమార్, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిశీలకురాలు సీతాలక్ష్మి


హాజరైన అధికారులు

వ్యయ వివరాలు నమోదు చేయాలి

● పరిశీలకుడు శ్రీనివాస్ బాబు


మాట్లాడుతున్న వ్యయ పరిశీలకుడు శ్రీనివాస్ బాబు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు రోజు వారి ప్రచార వ్యయ ఖర్చుల వివరాలను నమోదు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు శ్రీనివాస్ బాబు సూచించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మొదటి విడతలో ఎన్నికలు నిర్వహించనున్న గండీడ్, మహమ్మదాబాద్, మహబూబ్‌నగర్, నవాబ్‌పేట, రాజాపూర్ మండలాల అభ్యర్థులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల చట్టపరమైన నిబంధనలు, ఎన్నికల కమిషన్ మార్గదరకాలు, వాటి అమలు గురించి వివరించారు. ఫలితాలు వెలువడిన 45 రోజులలోపు అభ్యర్థులు ఎన్నికల్లో ఖర్చు చేసిన వివరాలు సంబంధిత ఎంపీడీవోలకు అందించాలని తెలిపారు.

ఈ నెల 10న ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్

» బ్రోచర్‌ను ఆవిష్కరించిన పీయూ వీసీ



బ్రోచర్ ను విడుదల చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్ బాబు, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో ఈ నెల 10న ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. ఎన్ఎస్ఎస్, బియాండ్ యువర్ మైండ్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో 'ఛాలంజెస్ ఫేసింగ్ బై ఉమెన్ అండ్ యూత్' అంశంపై ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ ఆడిటోరియంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబుతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ముఖ్యవక్తగా ప్రొఫెసర్ సరోజ గుళ్లపల్లి, బియాండ్ యువర్ మైండ్ ఫౌండేషన్ నుంచి మెల్‌బోర్న్, ఆస్ట్రేలియా నుండి బక్తలు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ, చైర్మన్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ రవికాంత్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రవికుమార్, డాక్టర్ రాఘవేందర్ పాల్గొన్నారు.

తరగతి గదులకు పరిమితం కావొద్దు

» ప్రొఫెషనల్ కోర్సులపై అవగాహన పెంచుకోవాలి

» పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎస్ నవీన్ శేఖర్, సీఎస్ మురళి

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తరగతి గదులకు పరిమితం కాకుండా, ప్రొఫెషనల్ కోర్సులపై అవగాహన పెంపొందించుకోవాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. 'కంపెనీ సెక్రటరీ వృత్తి, అవకాశాలు, భావితర దృక్పథం' అనే అంశంపై పీయూలోని అకాడమిక్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కంపెనీ సెక్రటరీ వంటి ప్రొఫెషనల్ కోర్సులకు కార్పొరేట్ రంగంలో భారీ డిమాండ్ ఉందని తెలిపారు. రిజిస్ట్రార్ పూస రమేశ్‌బాబు మాట్లాడుతూ కార్పొరేట్ గవర్నెన్స్, చట్టపరమైన అనుసరణ, ప్రమాణాలు పెరుగుతున్న నేపథ్యంలో కంపెనీ సెక్రటరీలకు డిమాండ్ వేగంగా పెరుగుతోందన్నారు. ప్రైవేటు, పబ్లిక్ సంస్థలు, బ్యాంకులు, స్వతంత్ర ప్రాక్టీస్ రంగాల్లో అద్భుతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రధానవక్త, ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్‌కు చెందిన సీఎస్ నవీన్ శేఖర్ మాట్లాడుతూ సీఎస్ కోర్సు దశలు, అవసరమైన నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు, వృత్తి ఎదుగుదల తదితర అంశాలను వివరించారు. సదస్సులో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, కన్వీనర్లు డాక్టర్ అనురాధారెడ్డి, డాక్టర్ రాజ్‌కుమార్, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్వీఎస్‌లో ఉచితంగా గుండె ఆపరేషన్లు



మాట్లాడుతున్న డాక్టర్ కె.జెరెడ్డి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యశ్రీ పథకం కింద ఎస్వీఎస్‌లోనే ఉచితంగా గుండె ఆపరేషన్లు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎస్వీఎస్ విద్యాసంస్థల ఎండీ డా.కె.జె రెడ్డి అన్నారు. గురువారం ఆసుపత్రిలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యసేవలతో పాటు గుండె సంబంధిత ఆపరేషన్లు కూడా ఈ ఏడాది నవంబరు నుంచి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇందుకోసం అత్యాధునిక వైద్య పరికరాలతో పాటు కార్పొరేట్‌లో పనిచేసిన గుండె వైద్య నిపుణులతో పాటు మరో 8 మంది వైద్య బృందాన్ని నియమించామన్నారు.

వీరంతా 24 గంటలు అందుబాటులో ఉండి గుండె సంబంధిత వ్యాధులకు చికిత్స అందిస్తారన్నారు. ఇప్పటికే నలుగురికి ఓపెన్ హార్ట్ సర్జరీ, 5 మందికి వాల్వ్ రీప్లేస్‌మెంట్, 10 మంది వరకు యాంజియోగ్రామ్ చేశామని తెలిపారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సనర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జోషి పాల్గొన్నారు.

గగన్ చంద్రకు ఘన సన్మానం

» సన్మానించిన షెడ్యూల్డ్ కులాల శాఖ కమిషనర్ క్షితిజ



హైదరాబాద్‌లో యువ సైంటిస్టు గగన్ చంద్రను సన్మానిస్తున్న కమిషనర్ క్షితిజ

బల్మూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న యువ సైంటిస్టు గగన్‌చంద్రను ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్ క్షితిజతో పాటు జేడీ శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, డీపీవోలు రమాదేవి, సల్మాన్‌భాను, శ్రావణ్‌కుమార్‌లు గురువారం ఘనంగా సన్మానించారు. నాగర్‌కర్నూల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి ఉమాపతి ఆధ్వర్యంలో ఈ సన్మానం నిర్వహించినట్లు బల్మూరు ఎస్సీ వసతి గృహం వెల్ఫేర్ అధికారి ఆలేటి కృష్ణ తెలిపారు. విద్యార్థి యంగ్ సైంటిస్టు గగన్ చంద్ర జాతీయ స్థాయిలో గుర్తించారని, ఈ మధ్యలో తాను కనుగొన్న త్రీ ఇన్ వన్ బైస్కిల్ నేషనల్ లెవెల్‌లో గుర్తించి అతనికి సైంటిస్టు అవార్డు ఇచ్చారని, అలాగే గ్రైడ్ ఉపాధ్యాయుడు సేనావత్ సీతారాంను శాలువాలతో సన్మానించినట్లు వారు తెలిపారు. అలాగే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ట్విట్టర్‌లో మన హాస్టల్ విద్యార్థిని గుర్తించారు. విద్యార్థికి పూర్తిస్థాయిలో సహకరించేందుకు జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి వసతులు కల్పించాలని తమకు ఉన్నతాధికారులు తెలిపారని హస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆరటి కృష్ణ తెలిపారు.

వేర్వేరు.. నేల తీరు

» ఉమ్మడి పాలమూరు జిల్లాలో విభిన్న నేలలు

» ఎర్రమట్టి, నల్లరేగడి, దుబ్బ, మిశ్రమ, ఇసుక నేలలు

» భూసారాన్ని బట్టి పంటల సాగుతో అధిక దిగుబడులు

» నేడు అంతర్జాతీయ మృత్తికా దినోత్సవం



జడ్చర్ల భూసార పరీక్ష కేంద్రంలో మట్టి నమూనాలకు పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

జడ్చర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నేల స్వభావం, భూసారాన్ని బట్టి పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని వ్యవసా య అధికారులు చెప్తున్నారు. అందుకు రైతులు తమ పొలంలోని మట్టిని సేకరించి భూసార పరీక్షలు చేయించాలి. వారిచ్చే నివేదిక ఆధారంగా పంటలను సాగు చేయాల్సి ఉంటుంది. ఈ విషయంపై రైతులకు అవగాహన కలిగించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం డిసెంబరు 5న అంతర్జాతీయ మృత్తికా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా ఎర్రమట్టి, నల్లరేగడి, ఇసుక, ఎర్రబంక, దుబ్బ, మిశ్రమ నేలలు ఉన్నాయి. వాటిల్లో ఎక్కువ నేలల్లో నైట్రోజన్ తక్కువగా, ఫాస్పరస్ అధికంగా ఉంటోంది. ఏ నేలలో ఎలాంటి పోషకాలు అధికంగా ఉన్నాయి, ఏ పోషకాలు అవసరమో తెలుసుకోవాలంటే రైతులు భూసార పరీక్షలు తప్పని సరి చేయించాలని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు.

జడ్చర్లలో భూసార పరీక్షా కేంద్రం

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని జడ్చర్ల పట్టణంలో భూసార పరీక్షా కేంద్రం ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రైతులు వినియోగించవచ్చు. తెలంగాణ రాష్ట్రంలో ఏకైక సూక్ష్మ ధాతవులను పరీక్షించే యంత్రం ఇక్కడే ఉంది. ప్రస్తుతం ఎసటలిన్ గ్యాస్‌తో జింక్, ఐరన్, మాంగనీస్, కాపర్ పోషకాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తున్నారు. మరిన్ని పోషకాలను తెలుసుకునేందుకు నైట్రోజన్ గ్యాస్‌ను వినియోగించి పరీక్షలు చేస్తున్నారు.

● మహబూబ్‌నగర్ జిల్లాలో 67 శాతం ఎర్రమట్టినేలలు, 20 శాతం నల్లమట్టినేలలు, 13 శాతం దుబ్బ, మిశ్రమ నేలలు ఉన్నాయి. ఈ నేలలు వేరుశనగ, పత్తి, జొన్న, పప్పుదినుసులు, ఆముదాలు, మర్చి, టొబాకో, చిరుధాన్యాలను పండించేందుకు అనువు.

● నాగర్‌కర్నూల్ జిల్లాలో 54 శాతం ఎర్రమట్టి, 29 శాతం ఇసుక, 6 శాతం నల్లమట్టి, 11 శాతం ఇతర నేలలు ఉన్నాయి. పత్తి, మొక్కజొన్న, కందులు, ఆముదాలు, వేరుశనగ పంటలకు అనుకూలం.

● నారాయణపేట జిల్లాలో 53 శాతం ఎర్రమట్టి, 32 శాతం ఇసుక, 15 శాతం నల్లమట్టి నేలలు ఉన్నాయి. వరి, జొన్నలు, మొక్కజొన్న, కందులు, పత్తి, మిర్చి, పొగాకు, చిరుధాన్యాలు పండించేందుకు అనుకూలం.

● వనపర్తి జిల్లాలో 47 శాతం ఎర్రమట్టి, 42 శాతం ఇసుక, 11 శాతం నల్లమట్టి నేలలు ఉన్నాయి. వాటిల్లో వరి, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, మిర్చి పంటలు సాగు చేయొచ్చు.

● జోగుళాంబ గద్వాల జిల్లాలో 50 శాతం ఎర్రమట్టి, 30 శాతం ఎర్రబంక, 20 శాతం నల్లరేగడి నేలలు ఉన్నాయి. ఇవి వరి, మొక్కజొన్న, జొన్నలు, కందులు, పత్తి, మిర్చి, పొగాకు పత్తి సాగుకు అనుకూలం.

పొలంలోని మట్టికి పరీక్షలు

భూసార పరీక్షల కోసం వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించినట్లుగా రైతులు తమ పొలంలోని మట్టిని సేకరించాల్సి ఉంటుంది. చెట్టునీడ, గట్లున్న స్థలం, పెంటకుప్పలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతం, ఎరువు పోసిన స్థలంలో ఉండే మట్టిని సేకరించొద్దు. ఒక ఎకరా పొలంలో 20 స్థలాల్లో మట్టిని సేకరించాల్సి ఉంటుంది. నాగలి లోతున 'ఆంగ్లం వి' ఆకారంలో 15, 30 సెంటీమీటర్ల పొడవు, వెడల్పు గుంత తవ్వి ఆ మట్టిని సేకరించాలి. ఆ మట్టిని నాలుగు కుప్పలుగా పోయాలి. అర కేజీ మట్టి వచ్చే వరకు ఎదురెదురుగా ఉన్న కుప్పలు తీసి పక్కన పెట్టాలి. మిగిలిన మట్టిని ఒక కవరులో పోసి, భూసార పరీక్షా కేంద్రంలో ఇవ్వాలి. అక్కడి సిబ్బంది భూసార పరీక్షలు నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు. తద్వారా నేలలో ఏ పోషకాలు తక్కువగా ఉన్నాయి, ఎరువులు ఎంత వినియోగించాలి వంటి వివరాలు తెలుస్తాయి.

సాయిల్ హెల్త్ కార్డులు జారీ



భూసార పరీక్షల అనంతరం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను అందిస్తాం. పంటల సాగుకు ఎంత మోతాదులో ఎరువులను వినియోగించాలో సూచిస్తాం. 'సాయిల్ హెల్త్ రాష్ట్రీయ కృషి యోజన'లో భాగంగా నారాయణపేట, వనపర్తి, జోగులాంబగద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల నుంచి వచ్చిన 26 వేల మట్టి నమూనాలకు పరీక్షలు నిర్వహించాం. మహబూబ్‌నగర్ జిల్లా మట్టి నమూనాలకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న రీజనల్ భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

- రేవతి, ఏవో, భూసార పరీక్ష కేంద్రం

సేంద్రియ ఎరువులను వినియోగించాలి



సేంద్రీయ ఎరువులను వినియోగించాలని రైతులకు సూచిస్తున్నాం. విషపూరితమైన రసాయనిక ఎరువులను ఎక్కువగా వాడితే భూమిలో సారం తగ్గిపోతుంది. దక్కులు దున్నేటప్పుడు పచ్చరొట్ట ఎరువులను వాడాలి. సాగుకు నేలను సిద్ధం చేసేటప్పుడు వర్మీ కంపోస్ట్ లేదా పశువుల ఎరువును వినియోగించాలి. విత్తనాలు నాటే సమయంలో బీజామృతం, వేపగింజల కషాయాన్ని పిచికారి చేయాలి. జీవామృతాన్ని పిచికారి చేసుకుంటే పంటలకు ఎంతో మేలు కలుగుతుంది.

- ప్రత్యూష, ఏవో, భూసార పరీక్ష కేంద్రం :



పడమటి ఆంజనేయస్వామిని దర్శించుకున్న మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు



పడమటి ఆంజనేయస్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు

కనుల పండువగా రథోత్సవం

» వేలాదిగా తరలొచ్చిన భక్తులు

» మక్తల్‌లో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి తెల్లవారుజామునే తలనీలాలు సమర్పించి, కోనేరులో స్నానం చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మునిసిపల్ కమిషనర్ శ్రీరాములు కుటుంబ సమేతంగా వెళ్లి, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. రథోత్సవం నేపథ్యంలో బుధవారం రాత్రే వ్యవసాయ మార్కెట్, రామవేంద్ర, శబరి కాలనీల భక్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకొన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శక్తిపీఠం వ్యవస్థాపకులు శాంతనంద పురోహిత్ స్వామివారిని దర్శించుకున్నారు. 3 గంటలకు పల్లకీసేవ, 4 గంటలకు స్వామివారికి మంగళహారతులు నిర్వహించారు. సాయంత్రం 5:30 గంటలకు ఉత్సవ మూర్తి విగ్రహాన్ని రథం వద్దకు తెచ్చారు. పూజలు చేసి, రథంపై ఉంచారు. అనంతరం అశేష భక్తజనం రథాన్ని లాగారు. ఈ సందర్భంగా జైశ్రీరాం నినాదాలు మారుమోగాయి. కర్ణాకట, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మహారాష్ట్ర, గుజరాత్, గోవా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వాములు, వీహెచ్‌పీ, భజరంగదళ్, ఆర్ఎస్ఎస్ నాయకులు లైన్‌లలో భక్తులకు సహకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ప్రాణేషాచారీ, ఈవో కవిత, సత్యనారాయణ, అర్చకులు అరవింద్, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేటి నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీ

» పాలమూరు డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహణ

» ప్రారంభించనున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

» పోటీలకు 34 జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు



మహబూబ్‌నగర్ జిల్లా కబడ్డీ బాలుర జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణంలోని డీఎస్‌ఏ స్టేడియం 51వ రాష్ట్రస్థాయి జూనియర్స్ కబడ్డీ బాలుర టోర్నీకి వేదిక కానున్నది. కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 7వ తేదీ వరకు ఈ పోటీలను నిర్వహించనున్నారు. కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురువారం ఇండోర్ స్టేడియంలో టోర్నీ ఏర్పాట్లను పరిశీలించారు. మూడు రోజుల పాటు ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు కొనసాగనున్న పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. 100 మందికి పైగా కోచ్‌లు, మేనేజర్లు హాజరుకానున్నారు. శుక్రవారం సాయంత్రం 3 గంటలకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి టోర్నీని ప్రారంభించనున్నారు. ముగింపు వేడుకలకు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు, ఒలిపింక్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ జితేందర్‌రెడ్డి హాజరుకానున్నారు. టోర్నీకి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం కప్ పోటీలకు జిల్లా క్రీడా శాఖ ఏర్పాట్లు చేసింది. ఇండోర్‌స్టేడియంలో నాలుగు కోర్టులను సిద్ధం చేశారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగనున్నాయి. క్రీడాకారులకు మాడ్రన్ హైస్కూల్, టీఎన్జీవో భవనం, అంబేడ్కర్ కళాభవన్‌లలో వసతి, భారత్ సౌట్స్ అడ్ గైడ్స్ భవనంలో భోజనాలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర జట్టును ఇక్కడే ఎంపిక చేయనున్నారు.

ప్రతిభ చూపిన క్రీడాకారులను జనవరి 14 నుంచి 18వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి టోర్నీకి పంపించనున్నారు.

● మహబూబ్‌నగర్ జిల్లా బాలుర జట్టులో జె.పాండు, జే. సురేశ్, శివకుమార్, అరవింద్, రామ్‌చరణ్, హేమంత్, కౌశిక్, నందీశ్వర్, చందు, గౌతమ్, దేవ్‌సింగ్, శివప్రసాద్, హర్షవర్ధన్, మణికంఠ ఉన్నారు.

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రద్దు చేయాలి

» ఆ తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

» స్పష్టం చేసిన భూ నిర్వాసితులు



భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో జనార్దన్‌రెడ్డి

చారకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రాథమిక నోటిఫికేషన్‌ను రద్దు చేసిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. లేకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. డిండి - నార్లాపూర్ ఎత్తిపోతల పథకంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని గోకారం శివారులో రిజర్వాయర్ నిర్మిస్తున్నారు. అందుకోసం ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ ఎర్రవల్లి, ఎర్రవల్లి తండాకు చెందిన భూ నిర్వసితులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం 3వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్‌రెడ్డి ఎర్రవల్లికి చేరుకొని దీక్షా శిబిరంలో నిర్వసితులతో మాట్లాడారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు నామినేషన్ వేసేందుకు శుక్రవారం చివరి రోజని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయాలని, గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులుగా ప్రశ్నించవచ్చని సూచించారు. నిర్వసితుల సమస్యలపై జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఎన్నికలను బహిష్కరించడం సరైన పద్ధతి కాదన్నారు. ఆర్ అండ్ ఆర్ నోటిఫికేషన్‌ను రుద్దు చేయాలని, లేకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, చారకొండ, వెల్దండ తహసీల్దార్లు ఉమ, బీశ్వ కార్తీక్, ఆర్ఐలు భరత్‌గౌడ్, శంకర్‌నాయక్, సుజాత, అంజి, శ్రీను, శ్రీనివాసులు, నాయకులు ప్రకాశ్, నాగయ్య, సంజీవ్, పర్వతాలు, పెద్దయ్యగౌడ్, రెడ్యానాయక్ పాల్గొన్నారు.

పంచాయతీలకు ఎన్నికల 'కలెక్షన్స్'

» పన్నులు చెల్లిస్తున్న అభ్యర్థులు, ప్రతిపాదకులు



అడ్డాకుల రైతువేదిక వద్ద పోటీదారుల నుంచి ఇంటి పన్నులు వసూలు చేస్తున్న కార్యదర్శి

మహబూబ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇన్నాళ్ళు పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు వెంటపడితే కూడా పన్నులు చెల్లించకుండా తప్పించుకుని తిరిగిన వారు, ఇప్పుడు వారిని వెతుక్కుంటూ వెళ్ళి పన్నులు కడుతున్నారు. క్యూలో గంటల తరబడి నిలబడి మరీ బకాయిలన్నీ ఒకేసారి చెల్లిస్తున్నారు. ఇదంతా గ్రామ పంచాయతీ ఎన్నికల మహత్యం. దీని పుణ్యమా అని పంచాయతీలకు కలెక్షన్లు దండిగా వస్తున్నాయి. సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీ చేసే అభ్యర్థులతో పాటు, వారికి ప్రతిపాదకులుగా ఉండేవారికి పంచాయతీలకు పన్ను బకాయి ఉండకూడదన్న నిబంధన ఉండటమే దీనికి కారణం. ఇంటి పన్నులు, కొళాయి పన్నుల బకాయి ఉంటే పోటీ నుంచి వైదొలగాల్సి వస్తుంది. అందుకే వారందరూ బకాయిలు క్లియర్ చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో అభ్యర్థులే మద్దతుదారుల బకాయిలు చెల్లిస్తున్నారు.

మద్యం పట్టివేత కేసు నమోదు

» ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

» ఎస్ఐ గురుస్వామి

తాడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంతకోడూరు గ్రామానికి చెందిన మహేష్‌గౌడ్ అనే వ్యక్తికి సంబంధించిన మద్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ గురుస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలల్లో పంచాయతీ ఎన్నికలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నికల నియమాలకు విరుద్ధంగా బెల్టుషాపులు నిర్వహించవద్దని ముందస్తుగా చెప్పినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తూ మద్యం దుకాణాలను నడిపేందుకుప్రయత్నిస్తున్న వారందరిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కావున ఇప్పటికైనా ఎన్నికల నిబంధనలు పాటించి ఎవరూ మద్యాన్ని విక్రయించే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ఆత్మకూరు ,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని వైన్ షాప్ నుంచి మదనాపూర్ మండలం కర్ని గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు ఎస్ఐ జయన్న తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కర్ని గ్రామానికి చెందిన గుంటిపల్లి గుజ్జుల బుచ్చన్న అనే వ్యక్తి గతకొంతకాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఎలక్షన్ నియమ నిబంధనల కారణంగా జరిపిన దాడులలో అక్రమంగా 35, 90 ఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుమారుగా వాటి విలువ రూపాయలు 3.465 ఉంటుందని తెలిపారు. అనంతరం ఎస్ఐ జయన్న మాట్లాడుతూ... ఎవరైతే గ్రామాలకు అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎలక్షన్ కమిషన్ నియమించిన నియమ నిబంధనలు పాటించాలని గుర్తు చేశారు.

కిరాణ షాపులో మద్యం విక్రయం

» 6.39 లీటర్ల మద్యం సీజ్

ఉండవల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉండవల్లి మండల కేంద్రంలోని ఓ కిరాణం షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం అందడంతో పోలీసులు గురువారం మధ్యాహ్నం అందజాగా 12 గంటల సమయంలో దాడులు నిర్వహించారు. కాగా, సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తనిఖీలు చేయగా మొత్తం 6.39 లీటర్ల మద్యం పట్టుబడింది. దీని విలువ సుమారు రూ.7వేలుగా అంచనా వేశారు. ఇట్టి కిరాణం షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిగా కె.మధుశేఖర్, తండ్రి పేరు గోవిందు, మండల కేంద్రంలోని ఉండవల్లిగా గుర్తించారు. పట్టుబడిన మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనపై ఉండవల్లి ఎస్ఐ శేఖర్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

ఆలయ భూములను రిజిస్ట్రేషన్ చేయొద్దు

» జడ్చర్ల సబ్ రిజిస్ట్రార్‌కు వినతి

జడ్చర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయ భూములను ఎవరికీ రిజిస్ట్రేషన్ చేయొద్దని పట్టణానికి చెందిన అనిల్‌కుమార్, ఎంబీ బాలకృష్ణ కోరారు. ఈ మేరకు జడ్చర్ల సబ్ రిజిస్ట్రార్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ భూములపై కొందరు లావాదేవీలు నిర్వహిస్తు న్నారని ఆరోపించారు. సర్వే నెంబర్లు 160, 157ల లోని భూముల్లో ప్లాట్లను విక్రయించేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. ఎవరూ వాటిని కొనవద్దని, కొంటే నష్టపోతారని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పుడితే రూ.10 వేలు.. చచ్చిపోతే రూ. 5 వేలు

- బాండ్ పేపర్‌పై రాసిన సర్పంచ్ అభ్యర్థి
- సామాజిక మాధ్యమాల్లో విడుదల



పగిడ్యాల గ్రామ సర్పంచ్ అభ్యర్థి కవిత

మహబూబ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అభ్యర్థులు రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. కొందరు హామీలు ఇస్తుంటే, మరికొందరు మేనిఫెస్టోలు విడుదల చేస్తున్నారు. ఇంకొందరు మరో అడుగు ముందుకేసి ఏకంగా బాండ్ పేపర్ రాసి ఇస్తున్నారు. అలాగే గండీడ్ మండలం పగిడ్యాల సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోరు కవిత తనను గెలిపిస్తే ఐదేళ్లలో చేపట్టన్ను పనులను బాండ్‌పేపర్‌పై రాసి సోషల్ మీడియాలో విడుదల చేశారు. గ్రామంలో ఆడపిల్ల పుడితే ఆ కుటుంబానికి రూ.10 వేలు, ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు రూ.5 వేలు ఇస్తానని అందులో పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. పాఠశాల విద్యార్థులకు సాయంత్రం ఉచిత తరగతులు, నిరుపేదలకు మొదటి ప్రాధాన్యంగా ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇలా 12 హామీలతో రాసిచ్చిన బాండ్‌పేపర్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. అయితే బాండ్ పేపర్‌లో ఆమె సంతకం లేకపోవడం విశేషం.

పల్లె పోరులో వైద్య విద్యార్థిని



నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న వైద్య విద్యార్థిని నిఖిత

పెబ్బేరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెబ్బేరు మండల పరిధిలోని ఏటిగడ్డ శాఖాపూర్ గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని కావలి నిఖిత పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తోంది. అందుకు బుధవారం ఆమె నామినేషన్ దాఖలు చేసింది. ఏటిగడ్డ శాఖాపూర్ బీసీ మహిళకు రిజర్వు కావడంతో ఆమెకు పోటీ చేసే అవకాశం దక్కింది. నిఖిత పెద్ద నాన్న, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కావలి గోవిందు భార్య కల్పన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగి కావడంతో తమ్ముడు కావలి కొల్లం కుమార్తె నిఖితను బరిలోకి దించారు. నిఖిత తండ్రి డిప్యూటీ తహసీల్దార్, తల్లి చిలకమ్మ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. నిఖిత ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది.

చివరి గుర్తు నాదే అనేందుకు వీలు లేదు

- ఎందుకంటే అక్కడ 'నోటా' ఉంటుంది

మహబూబ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):ఇది వరకు సర్పంచు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారం కోసం ఓటర్ల వద్దకు వెళ్ళినపుడు బ్యాలెట్ పేపర్‌లో తమ గుర్తు ఎక్కడ ఉందో ఓటర్లకు చెప్తూ ఉంటారు. మొట్ట మొదట తన గుర్తే అని.. మధ్యలో ఉండేది తమదని.. ఇలా ప్రచారం చేసుకునే వారు. అలాగే ఈ సారి మాత్రం అన్నింటి కన్నా కింద ఉన్న ఉండే గుర్తు మనదే అని, చివరి గుర్తు నాదే అని.. ఆ గుర్తు మీద ఓటు వేయాలని చెప్పుకునే అవకాశం ఈ సారి లేకుండా పోయింది. ఎందుకంటే ఈ సారి సర్పంచ్ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్‌పై తొలి సారి నోటా గుర్తు ఏర్పాటు చేశారు. పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే నోటా (పైది ఏదీ కాదు)కు ఓటు వేసుకునే అవకాశం ఉంటుంది.

అరచేతిలో ప్రచార అస్త్రం

- కాలం చెల్లిన వాల్‌రైటింగ్, బ్యానర్లు
- సోషల్ మీడియాకు పెరిగిన ప్రాధాన్యం
- ఎవరికి వారు వేర్వేరు వాట్సాప్ గ్రూపులు
- పంచాయతీ ఎన్నికల్లో వాటిదే కీలక పాత్ర



మహబూబ్‌నగర్/ వనపర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు పంచాయతీ ఎన్నికలంటే ఊరంతా సందడిగా మారేది. తెల్లటి గోడలు రాతలతో నిండిపోయేవి. నీలి రంగుతోనో, జాజుతోనో అభ్యర్థుల పేర్లు, గుర్తులను గోడలపై రాసి.. ఓట్లు అభ్యర్థిస్తూ నినాదాలు రాసేవారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో ఆ పద్ధతి కనుమరుగైంది. ఆ తరువాత బ్యానర్లు వచ్చాయి. ఫలానా అభ్యర్థికి ఓటేయాలంటూ తెల్లటి వస్త్రంపై నీలిరంగుతో రాసిన బ్యానర్లను వీధుల్లో, ప్రధాన కూడళ్లలో కట్టేవారు. ఆ తర్వాత ఫ్లెక్సీలు, స్టిక్కర్లు, కరపత్రాలు వచ్చాయి. అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఇంటింటికీ వెళ్లి తలుపులు, గోడలపై స్టిక్కర్లు అతికించే వారు. అభ్యర్థుల గుర్తులు, ఫొటోలు, వారికి మద్దతిచ్చే ముఖ్య నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలు వేసేవారు. ఆ పద్ధతి కొంత మేర ఇప్పటికీ కొనసాగుతున్నా, ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో ప్రచార పర్వం కొత్త పుంతలు తొక్కుతున్నది.

ట్రెండింగ్‌లో సోషల్ మీడియా

ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సోషల్ మీడియానే ట్రెండింగ్ అవుతోంది. ఇప్పుడు అందరి చేతుల్లోనూ ఉంటున్న మొబైల్‌ఫోనే ప్రచార అస్త్రంగా మారింది. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్నది. అన్ని గ్రామాల్లో అభ్యర్థులు, ముఖ్య నాయకులు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకున్నారు. వాటిని నిర్వహించేందుకు కొందరు కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో గ్రూపులో నాలుగైదు వందల మంది ఉంటారు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు సామాజిక మాధ్యమాలనే ప్రచారానికి వాడుకుంటున్నారు. గ్రామానికి చెందిన ఓటర్లు స్థానికంగా ఉన్నా, వేరే ఊర్లలో లేదా పట్టణాల్లో ఉన్నా ప్రచార సమాచారం వాట్సాప్ గ్రూపుల ద్వారా వారికి చేరుతోంది. హైదరాబాద్‌లో నివసిస్తున్న గ్రామ ఓటర్ల ఫోన్ నెంబర్లు తీసుకుని వారి కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు నిర్వహిస్తున్నారు.

గ్రూపుల్లో చర్చోపచర్చలు

పంచాయతీ ఎన్నికల వేళ వాట్సాప్ గ్రూపులు రాజకీయ చర్చలకు వేదికలుగా మారుతున్నాయి. పార్టీలకు సంబంధించిన వివిధ గ్రూపులతో పాటు గ్రామాలు, కుల సంఘాలు, యువజన సంఘాల పేర్లతో ఉన్న గ్రూపుల్లో ఎక్కడ చూసిన ఎన్నికలకు సంబంధించిన చర్చలు, పోస్టులే దర్శనమిస్తున్నాయి. నామినేషన్లు వేసిన, బరిలో ఉన్న, ఉండనున్న అభ్యర్థులకు అనుకూలంగా, ప్రతికూలంగా కామెంట్లు పెడుతున్నారు. అలాగే పార్టీల మద్దతు ఆశించి భంగపడ్డవారు, వారి అనుచరులు, అవకాశం దక్కిన వారు, వారి మద్దతుదారుల పోటాపోటీగా సోషల్ వార్ కొనసాగుతోంది.

ఒక్కో ఊర్లో 8 నుంచి 10 గ్రూపులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఒక్కో గ్రామంలో 8 నుంచి 10 గ్రూపుల వరకు వాట్సాప్ గ్రూపులున్నాయి. ఉదాహరణకు నవాబ్‌పేట మండలం యన్మన్‌గండ్ల గ్రామంలో 8 విలేజ్ వాట్సాప్ గ్రూపులున్నాయి. వాటిల్లో దాదాపు వెయ్యి మంది ఓటర్లు ఉన్నారు. ఆయా గ్రూపుల్లో ఇప్పటికే అభ్యర్థులు తమ ఫొటోలు, గుర్తులతో ప్రచారం చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. అలాగే తమ ప్యానెల్ తరపున పోటీ చస్తున్న వార్డు సభ్యుల వివరాలు, వారి గుర్తులను కూడా వాట్సాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఓటర్లకు చేరవేస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాల్లో ఉన్న వారి ఫోన్ నెంబర్లను కూడా గ్రూప్‌లో చేర్చి వారికి కూడా సమాచారం చేరవేస్తున్నారు. నామినేషన్ వేయడం, గుర్తుల ఖరారు, ప్రచార సరళిని కూడా వీడియోలు తీసి గ్రూపులో పోస్టు చేస్తున్నారు. ఒక్క క్లిక్‌తో నాలుగైదు వందల మందికి సమాచారం చేరుతుండటంతో ఎన్నికల ప్రచారానికి ఇంతకు మించిన అస్త్రం లేదని నాయకులు భావిస్తున్నారు. అదే విధంగా ఈ గ్రూపుల ద్వారా ఓటర్లకు ఎన్నికల సమాచారం ఎప్పటికప్పుడు తెలుస్తోంది.

తమ గ్రామంలో ఎవరు పోటీ చేస్తున్నారు? ఈ పార్టీ మద్దతు ఇస్తోంది? ప్రత్యర్థులు ఎవరు? ఇలా అన్ని విషయాలు వారికి తెలుస్తున్నాయి. అలాగే ఆయా గ్రూపుల్లో ఓటరు జాబితాలను కూడా పోస్టు చేస్తుండటంతో తమ ఓటు ఏ వార్డులో ఉందో తెలుసుకుంటున్నారు.

రూ. 1.45 లక్షలు స్వాధీనం



గండీడ్ మండల కేంద్రంలో నగదును పట్టుకున్న పోలీసులు

గండీడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటంతో అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలంలోని కొనగట్టుపల్లి గ్రామానికి చెందిన ఇప్పలి వెంకటయ్య ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు ఆపి తనిఖీ చేశారు. అతడి వద్ద సంబంధిత ఆధారాలు లేని రూ.1.45 లక్షలు లభించడంతో స్వాధీనం చేసు కొని ఆర్డీవోకు పంపించి, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

పోటీ కోసం రాజీనామా

పాన్‌గల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండలంలోని చిక్కేపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ స్థానానికి పోటీ చేసేందుకు ఓ ఆశ కార్యకర్త ఉద్యోగానికి రాజీనామా చేసింది. గ్రామానికి చెందిన పార్వతి 10 సంవత్సరాల నుంచి ఆశా కార్యకర్తగా పనిచేస్తోంది. చిక్కేపల్లి గ్రామంలో సర్పంచ్ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ అయ్యింది.

దీంతో ఆమె తన ఉద్యోగానికి రాజీనామా చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చంద్రశేఖర్‌కు లేఖను అందించారు. రాజీనామా లేఖను డీఎంహెచ్‌వోకు నివేదించగా, గురువారం ఆమోదించినట్లు ఆయన తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీల మద్దతుగా తాను శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆమె తెలిపారు.



ఎన్నికల నివేదిక తారుమారు

- ఆగ్రహించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్
- అధికారులకు అర్ధరాత్రి 2 గంటల వరకు పని

కోస్గి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, గుండుమాల్ మండలంలోని అమ్లికుంటలో ఎన్నికల నివేదిక తారుమారయ్యింది. గుర్తించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు అర్ధరాత్రి 3 గంటల వరకు పని చేసి నివేదికను సరిచేసి ఇచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడుత నామినేషన్ల ఉపసంహరణ బుధవారం ముగిసింది. ఆ తర్వాత అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. అయితే ఈ అంశంపై అమ్లికుంట ఆర్‌వో పరశురాం, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి ఇచ్చిన నివేదికల్లోని వివరాలు వేర్వేరుగా ఉన్నాయి. విషయాన్ని కలెక్టర్ సిక్తాపట్నాయక్ గుర్తించి, అర్ధరాత్రి 12 గంటలకు అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎంపీడీవో అప్రమత్తమై ఆర్‌వో పరశురామ్‌ను రాత్రి ఒంటి గంటకు గుండుమాల్ ఎంపీడీవో కార్యాలయానికి పిలిపించారు. ఆ తర్వాత రాత్రి 3 గంటల వరకు కూర్చొని నివేదికను సరి చేసి ఇచ్చారు.

రూ.15 లక్షలు.. 20 లక్షలు.. 30 లక్షలు

- సర్పంచు పదవికి పోటాపోటీ వేలం
- అయినా కుదరని ఏకాభిప్రాయం



హన్వాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసేందుకు అభ్యర్థుల మధ్య పోటాపోటీ నెలకొన్నది. పదవి కోసం ఇవ్వాల్సిన మొత్తాన్ని అభ్యర్థులు పోటీపడి అంతకంతకూ పెంచుతూ పోయారు. చివరకు ఒకరు రూ. 30 లక్షలు ప్రకటించినా ఏకాభిప్రాయం కుదరలేదు. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలంలోని కిష్టంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచు పదవికి ప్రధాన పార్టీల మద్దతుతో పాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే గ్రామ పెద్దలు అభ్యర్థులతో సమావేశమయ్యారు. ఊరిలో ఆలయ నిర్మాణం పెండింగ్‌లో ఉందని, సర్పంచు పదవిని ఏకగ్రీవం చేసి, వచ్చే డబ్బుతో పూర్తి చేద్దామని నిర్ణయించారు. అందుకోసం ఓ అభ్యర్థి రూ.15 లక్షలు ఇస్తానని ముందుకొచ్చారు. మరొకరు రూ. 20 లక్షలు ఇస్తామని ప్రకటించారు. చివరకు ఒకరు రూ.30 లక్షలు ఇస్తామని చెప్పినా, మరో ఇద్దరు అంగీకరించకపోవడంతో ఏకాభిప్రాయం కుదరలేదు.

క్రైం కార్నర్

డాక్టర్ సుహాసినీ రెడ్డి కన్నుమూత

- ఆమె గద్వాల సంస్థానం రాజవంశీయులు



డాక్టర్ సుహాసినీ రెడ్డి (ఫైల్)

గద్వాల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గద్వాల సంస్థానం రాజవంశానికి చెందిన డాక్టర్ సుహాసినీ రెడ్డి (85) హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. పట్టణంలోని కృష్ణారెడ్డి బంగ్లా కోడలిగా గద్వాల ప్రజలకు చిరపరిచితురాలైన ఆమె ఉమ్మడి రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య శాఖలో డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించి, ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలోని మానవ వనరుల విభాగంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అత్యంత సన్నిహితురాలిగా పేరు తెచ్చుకున్నారు. 2009 శాసనసభ ఎన్నికల్లో గద్వాల నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆమె పేరు తెరపైకి వచ్చినా, రాజకీయ సమీకరణల నేపథ్యంలో అవకాశం దక్కలేదు. రాష్ట్ర విభజన అనంతరం కొంతకాలం రాజకీయాల్లో క్రియాశీలకంగా కొనసాగిన ఆమె వయోభారం కారణంగా పూర్తిగా దూరమయ్యారు. దివంగత సుహాసిని రెడ్డి అంత్యక్రియలు శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో నిర్వహించనున్నట్లు కుమారుడు లక్ష్మీ కేశవరెడ్డి తెలిపారు.

గంజాయి పట్టివేత

- బిహార్ నుంచి తెచ్చి ఇక్కడ విక్రయం
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్‌గౌడ్

జడ్చర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ మండలంలోని ముదిరెడ్డిపల్లిలో బిహార్ రాష్ట్రానికి చెందిన బిజేష్‌కుమార్ అనే వ్యక్తి వద్ద గంజాయి లభించింది. సంఘటనకు సంబంధించిన వివరాలను గురువారం జడ్చర్ల ఎక్సైజ్ స్టేషన్‌లో మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్‌గౌడ్ వెల్లడించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన బిజేష్‌కుమార్ జడ్చర్ల మండలం, పోలేపల్లి టీఎస్‌ఐఐసీ ప్రాంగణంలోని సుప్రీం ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతడు బిహార్ రాష్ట్రం నుంచి రైలు మార్గం ద్వారా గంజాయిని తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్న ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో అతడి నివాసంలో ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేయగా, కిలో 100 గ్రాముల గంజాయి దొరికింది. తెచ్చిన గంజాయిని 5 గ్రాములకు రూ.400 చొప్పున విక్రయిస్తున్నట్లుగా విచారణలో తేలింది. నిందితుడు బిజేష్‌కుమార్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు. నిందితుడిపై ఇప్పటికే జడ్చర్ల, మహబూబ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్లలో ఒక్కో కేసు నమోదయ్యిందని సూపరింటెండెంట్ తెలిపారు. జడ్చర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు 12 కేసులు నమోదు చేసి, 6.4 కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవ్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్‌ఐలు నాగరాజు, కార్తీక్‌రెడ్డి, శ్రుతి, హెడ్‌కానిస్టేబుళ్లు మురళీమోహన్, రమేశ్, నతానియేల్, కానిస్టేబుళ్లు సిద్ధార్థ, జ్యోతి, సునీత ఉన్నారు.



గంజాయి విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన నిందితుడితో సూపరింటెండెంట్ సుధాకర్‌గౌడ్, సిబ్బంది

అంగరంగ వైభవం

- భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వర కల్యాణం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- రామాపురంలో పండుగ వాతావరణం



రామాపురంలో వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న భక్తులు

పెంట్లవెల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలంలోని రామాపురంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రాతఃకాల పూజలు, అభిషేకం, దీక్ష, శాంతి హోమాలు నిర్వహించారు. అనంతరం 11:30 గంటలకు వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ అలివేలుమంగ సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాభివృద్ధి సలహాదారులు జూపల్లి రవీందర్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు పగిడాల శ్రీనివాసులు, ఆలయ కమిటీ చైర్మన్ నల్లవెల్లి చంద్రయ్య, కొమ్మరాజు, కొమ్మ గోపాల్, గడ్డం శేఖర్‌యాదవ్, కలమూరి నిరంజన్, ఉడత నాగరాజు, కలమూరి మధు తదితరులు పాల్గొన్నారు.



స్వామికి దాసంగాలు సమర్పిస్తున్న భక్తులు



వేంకటేశ్వర స్వామిని దర్శించుకొని వస్తున్న భక్తులు

గోవిందా.. గోవిందా..

- గున్ముక్లలో ఘనంగా ఉద్దాలోత్సవం
- కడపరాయస్వామికి ప్రత్యేక పూజలు
- వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

మరికల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, ధన్వాడ మండలంలోని గున్ముక్ల సమీపంలోని గుట్టపై వెలసిన కడపరాయ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఉద్దాలోత్సవాన్ని బుధవారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. కిష్టపూర్ గ్రామానికి చెందిన దళితులు నియమ నిష్ఠలతో ఉద్దాలను తయారు చేశారు. వాటిని ఎద్దుల బండ్లపై ఉంచి ఊరేగింపుగా స్వామి సన్నిధికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఉద్దాలను తాకేందుకు భక్తులు పోటీ పడ్డారు. గురువారం ఉదయం పండపంలో పాదుకలకు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి బందోబస్త ఏర్పాటు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించనున్నారు. అందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లపై పోక్సో కేసు

- గురుకుల పాఠశాలలో విద్యార్థినిపై వేధింపులు
- విచారణ చేపట్టిన డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని ఓ గురుకుల పాఠశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ రజనిలపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పాఠశాలకు చెందిన ఓ విద్యార్థినిపై వైస్ ప్రిన్సిపాల్ ఏడాదిగా లైంగిక వేధింపులకు పాల్పడుతోంది. ప్రిన్సిపాల్‌కు విషయం తెలిసినా పట్టించుకోలేదు. పోలీసు శాఖలోని షీటీం ఆధ్వర్యంలో ఇటీవల ఆ పాఠశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. అప్పుడా విద్యార్థిని తనపై జరుగుతున్న వేధింపులను వారి దృష్టికి తీసుకొచ్చింది. వారు ఈ విషయాన్ని ఎస్పీ జానకికి తెలపడంతో వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. బాధిత విద్యార్థినితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్‌లపై పోక్సో కేసు నమోదు చేశారు. వారిద్దరినీ సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

జములమ్మకు పౌర్ణమి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్, భక్తులు

గద్వాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని జమ్మిచేడ్ జములమ్మ తల్లికి పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈవో పురేందర్ కుమార్‌లు అమ్మవారికి ప్రత్యేక పూజల చేశారు. తర్వాత ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలోకి చేర్చి, ఆలయంలో చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

జోగుళాంబ సన్నిధిలో డైరెక్టర్ హరీశ్ శంకర్



అమ్మవారిని దర్శించుకుంటున్న సినీ డైరెక్టర్ హరీశ్ శంకర్

అలంపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ క్షేత్రంలోని జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వాములను తెలుగు సినీ డైరెక్టర్ హరీశ్ శంకర్ గురువారం దర్శించుకున్నారు. అంతకు ముందు ఆయనకు అర్చకులు సాదరస్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, స్పర్శ దర్శనం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన తదితర విశేష పూజలు చేశారు. ఆ తర్వాత అర్చకులు ఆయనకు శేషవస్త్రాలు అందించి, సత్కరించారు.

న్యూస్ బాక్స్

ఎన్నికల విధుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

● నారాయణపేట డీఎస్పీ లింగయ్య

కోస్గి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, రాజకీయ నాయకులకు తలొగ్గి పనిచేస్తే సహించేది లేదని నారాయణపేట డీఎస్పీ లింగయ్య అన్నారు. గురువారం కోస్గి పాలిటెక్నిక్ కళాశాలలో పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే పోలీసులకు ఆయన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే పోలీసులు ఎన్నికల కమిషన్ నిబంధనలు ఎక్కడ కూడా విస్మరించకూడదన్నారు. గ్రామాల్లో మద్యం, డబ్బు పంపిణీ చేసే వారి పై చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లను భయాందోళనలకు గురిచేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 200 మీటర్ల దూరంలో ప్రచారాన్ని నిషేధించాలని, ప్రజలు గుంపులుగా ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ మహేష్, సీఐ సైదులు, ఎస్‌ఐలు బాల్‌రాజ్, విజయ్‌కుమార్, ఆంజనేయులు తదితరులున్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని వినతి

నారాయణపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల నుంచి గర్భిణులు, చంటి పిల్లల తల్లులు, ఆరునెలల్లో పదవీ విరమణ పొందనున్న ఉద్యోగులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారిని మినహాయించాలని కోరుతూ పీఆర్టీయూ టీఎస్ జిల్లా శాఖ గురువారం డీపీవో సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నారాయణపేట మండల అధ్యక్షుడు రఘువీర్, రాములు తదితరులున్నారు.

బాలికల రక్షణ, భద్రతపై అవగాహన

నారాయణపేట న్యూటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం షీ టీమ్ పోలీసులు మహిళల భద్రత, బాలికల రక్షణ, వేధింపుల నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలపై జరిగే వేధింపులు, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియాలో వేధింపులు, అసభ్య ప్రవర్తనలు వంటి ఘటనలను అరికట్టేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు షీ టీమ్ పోలీసులు తెలిపారు. ఆపద సమయంలో 100, 112, 181 హెల్ప్‌లైన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే 87126 70398 నెంబర్‌కు కూడా సమాచారం ఇవ్వాలన్నారు. షీ టీమ్ పోలీసులు బాలరాజు, కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి పాదపూజ

నారాయణపేట న్యూటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పగిడిమారి రోడ్డులో గల వీర ధర్మజ మాణికేశ్వరి మాతా వ్యాసాశ్రమంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు నాగ సింహాసన, అభిషేకం, 10 గంటలకు గణపతి, అమ్మవారి పాదపూజ, 12 గంటలకు గాయత్రి మహాయజ్ఞం, మధ్యాహ్నా ఒంటి గంటకు మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం పూజకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాదయాత్రకు వెళ్తున్న స్వాములకు సన్మానం

నారాయణపేట న్యూటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన అయ్యప్ప మాలాధారణ చేసిన చంద్రయ్యగౌడ్, హన్మంతు రెండేళ్లుగా తమ గ్రామం నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళ్తున్నారని అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు డా.కె.భీమయ్య తెలిపారు. గురువారం ఆయన నివాసంలో పాదయాత్రగా వెళ్తున్న వీరిద్దరిని ఘనంగా సన్మానించారు. వీరి వెంట ఆర్‌ఎల్.నాయక్, రింకు, రవి, దయానందరెడ్డి, రవికుమార్ యాదవ్, సుధాకర్, రామకృష్ణతో పాటు మరికొందరు తరలివెళ్లారన్నారు.

వరి కొయ్యలకు నిప్పు పెట్టొద్దు

● వ్యవసాయ అధికారి అఖిలారెడ్డి

నర్వ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో వరి కొయ్యలను కాల్చివేస్తే భూసారం తగ్గి రైతులకే నష్టమని నర్వ మండల వ్యవసాయ అధికారి అఖిలారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి కొయ్యలను కాల్చితే విపరీతమైన వేడితో పొలంలో భూసారం కోల్పోతుందన్నారు. నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుందని, ముఖ్యంగా పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు రైతు మిత్ర పురుగులు నశిస్తాయని అన్నారు. దీంతో పంట దిగుబడి సరిగ్గా రాకపోవడంతో పాటు భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవకాశం కాలిపోతుందని తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కోస్గి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం తెల్లవారుజామున మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం పగిడాల నుంచి కోస్గికి ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను కోస్గి శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు.

మత్తు పదార్థాలను నిరోధించాలి

» కలెక్టర్ సిక్తా పట్నాయక్
» నషాముక్త్ భారత్ అభియాన్ వాహనం ప్రారంభం



లాన్ టెన్నిస్ కోర్టును ప్రారంభిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట న్యూటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్తు పదార్థాలను సంపూర్ణంగా నిషేధించి మాదక ద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మించుకుందామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వాహనాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చెడు అలవాట్లు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధి కోసం మత్తు వ్యసన నిర్మూలన అత్యంత కీలకమని సూచించారు.

వేదిక్ మ్యాథ్స్ పోస్టర్, వర్క్‌బుక్స్ ఆవిష్కరణ

నారాయణపేట : జిల్లాలో జరుగుతున్న చదువుల పండుగ కార్యక్రమం కింద విద్యార్థుల గణాంక సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో అమలు చేస్తున్న వేద గణితం సూపర్ మ్యాథ్స్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, వర్క్‌బుక్స్‌ను గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేదిక్ మాథ్స్ కార్యక్రమానికి మరింత సమగ్రంగా, ఫలితాల దిశగా అమలు చేయాలని, పాఠశాలల ఉపాధ్యాయులు కూడా చురుకైన భాగస్వామ్యం చూపించి విద్యార్థులను నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా జిల్లాలోని ఎంపిక చేసిన 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 4,407 మంది విద్యార్థులకు వేగవంతమైన గణన, లాజికల్ థింకింగ్, ప్రాథమిక గణిత నైపుణ్యాల పటిష్టతపై 90 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ అందించబడుతుందని, వేదిక్ మాథ్స్ ఆధారంగా రూపొందించిన ఈ పాఠ్యాంశం విద్యార్థుల్లో గణితం పట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు పోటీ పరీక్షల పట్ల కూడా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఏఎంవో విద్యాసాగర్ మాట్లాడుతూ చదువుల పండుగలో భాగంగా ప్రారంభమైన ఈ వేదిక్ మాథ్స్ ప్రోగ్రాం జిల్లాలోని విద్యార్థుల్లో లెక్కల వేగం, ఖచ్చితత్వం, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే దిశగా కీలకపాత్ర పోషించనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, సరోజినీ స్మార్ట్ లెర్నింగ్ ప్రతినిధులు మురహరి దోసల, నిహారిక పాల్గొన్నారు.

లాన్ టెన్నిస్ కోర్టు ప్రారంభం

నారాయణపేట జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఆధునిక సదుపాయాలతో నిర్మించిన కొత్త లాన్ టెన్నిస్ కోర్టును గురువారం కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ డా.వినీత్‌లు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బందికి పని ఒత్తిడి ఎక్కువగా ఉండే నేపథ్యంలో శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఈ లాన్ టెన్నిస్ కోర్టు వంటి సౌకర్యాలు పోలీసులు మాత్రమే కాదు, వారి కుటుంబ సభ్యులకు, యువతకు కూడా ఎంతో మేలు చేకూరుస్తాయని తెలిపారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, ఏఎస్పీ ఎండీ.రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, సీఐలు శివశంకర్, రాజేందర్‌రెడ్డి, సైదులు, ఆర్‌ఐ నరసింహ, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కోర్టు క్యూరేటర్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు, అమ్రేష్‌తో పాటు అన్ని శాఖల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అధికారులు టెన్నిస్ ఆడుతూ సిబ్బందికి ప్రోత్సాహం కల్పించారు.

పోటాపోటీగా నామినేషన్లు

» ముహూర్త బలం కోసం నాయకుల వెయిటింగ్
» ఊట్కూర్‌లో చీకట్లో నామినేషన్ వేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు



ఊట్కూర్ పంచాయతీ వద్ద చీకట్లో దరఖాస్తులు నింపుతున్న అభ్యర్థులు

ఊట్కూర్/కృష్ణ/మాగనూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మూడో విడుత ఎన్నికల్లో భాగంగా ఊట్కూర్ మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 220 వార్డులకు గాను గురువారం రెండో రోజు మండల వ్యాప్తంగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానానికి భారీగా నామినేషన్లు వేశారు. ఊట్కూర్‌లో సాయంత్రం 7 అవుతున్నా కూడా బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నుంచి సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేయడానికి అభ్యర్థులు వేచి ఉన్నారు. ఊట్కూర్‌లో ఉదయం నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు నామినేషన్ వేసేవారు లేక అధికారులు ఖాళీగా కూర్చున్నారు. ముహూర్త బలం దృష్టితో కాంగ్రెస్ నుంచి నలుగురు, బీజేపీ నుంచి ముగ్గురు, బీఆర్‌ఎస్ నుంచి ఇద్దరు సర్పంచ్ స్థానానికి నామినేషన్లు వేశారు. ఊట్కూర్ సర్పంచ్ స్థానానికి 1, చిన్నపొర్ల సర్పంచ్ స్థానానికి 2, ఎడవెల్లి 2, బిజ్వార్ స్థానానికి 1, కొత్తపల్లి సర్పంచ్ స్థానానికి 1, లక్ష్మీపల్లి 1, ఓబ్లాపూర్ సర్పంచ్ స్థానానికి 1, పగిడిమారి సర్పంచ్ స్థానానికి 3, పెద్దజట్రం సర్పంచ్ స్థానానికి 2, పగిడిమారి 3, పెద్దపొర్ల 2, పులిమామిడి 8, సమిస్తాపూర్ సర్పంచ్ స్థానానికి 1తో పాటు మల్లేపల్లిలో 5 వార్డులకు, చిన్నపొర్లలో 12 వార్డులకు, కొత్తపల్లిలో 6 వార్డులకు, లక్ష్మీపల్లిలో 3 వార్డులకు, ఓబ్లాపూర్‌లో 1 వార్డుకు, ఊట్కూర్‌లో 2 వార్డులకు, బిజ్వార్‌లో 6 వార్డులకు, పగిడిమారిలో 18 వార్డులకు నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మల్లెపల్లి సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేసేందుకు గ్రామస్థులు భారీగా తరలివచ్చారు.

అదేవిధంగా, కృష్ణ మండలంలో రెండో రోజు అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు వేశారు. సర్పంచ్ అభ్యర్థులు 26, వార్డుల అభ్యర్థులు 53 మంది నామినేషన్ వేశారు. కృష్ణ క్లస్టర్‌లోని కుసుమూర్తి, తంగడిగి, గురుజాల్, కృష్ణ, హిందూపూర్ గ్రామాలకు 11 మంది అభ్యర్థులు, కున్సి క్లస్టర్‌లోని ఐనాపూర్, చేగుంట, అలంపల్లి, ఖాన్‌దొడ్డి, కున్సి గ్రామాలకు సర్పంచ్ అభ్యర్థులు 5, వార్డు అభ్యర్థులు 9, ముడుమాల్ క్లస్టర్‌లో మురహర్‌దొడ్డి, ముడుమాల్ సర్పంచ్ అభ్యర్థులు 5, వార్డు అభ్యర్థులు ఇద్దరు నామినేషన్లు వేయగా గుడెబల్లూరు క్లస్టర్‌లో గుడెబల్లూరు సర్పంచ్ అభ్యర్థులు 5, వార్డు అభ్యర్థులు 10 మంది నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు.

మాగనూరు మండలంలోని ఐదు క్లస్టర్లలో గురువారం హోరాహోరీగా నామినేషన్లు వేశారు. సర్పంచ్ స్థానాలకు 26, వార్డు స్థానాలకు 46 మంది నామినేషన్లు వేశారు.

ఘనంగా చెల్లంపల్లి ఆంజనేయస్వామి ఉత్సవాలు



చెల్లంపల్లి ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో సన్మానం పొందిన భజన మండలి సభ్యులు

కొత్తపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడ్జింత గ్రామ శివారులో మారీ చెట్ల మధ్యలో వెలసిన చెల్లంపల్లి ఆంజనేయస్వామి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఐదురోజుల నుంచి స్వామివారి ఆలయంలో భజన మండలి సభ్యులు, గ్రామస్థులు అఖండ భజన కీర్తనలు నిర్వహించారు. గురువారం పౌర్ణమి సందర్భంగా స్వామివారికి జల్దిబిందె, పల్లకీసేవ అనంతరం స్వామివారికి పూజారి ఆధ్వర్యంలో అభిషేకం, అర్చనలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రధాన అర్చకులు గోపాల్‌రావు, సూర్యప్రకాష్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పాండునాయక్, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ గ్రామాల సర్పంచులకు ధ్రువీకరణ పత్రాలు జారీ



మోమినాపూర్ సర్పంచ్ శ్రీదేవికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి

మద్దూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్దూర్ మండలంలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులకు ఎన్నికల అధికారులు గురువారం ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. అనంతరం ఆయా ఏకగ్రీవ గ్రామాల్లో ఉపసర్పంచుల ఎన్నిక నిర్వహించగా అప్పిరెడ్డిపల్లి ఉపసర్పంచ్‌గా సందమోళ్ల శ్రీనివాస్, చెంద్రానాయక్ తండాలో తులిసిబాయి, దామ్లతండాలో రమేశ్‌నాయక్, మొమినాపూర్‌లో సోల కాశమ్మ, పర్సాపూర్‌లో విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంపీడీవో రామన్న తెలిపారు.

ఆదర్శ గాయకుడు ఘంటసాల



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గాయకులు

నారాయణపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నేటి గాయకులకు ఘంటసాల ఆదర్శనీయమని, ఆయన గాన అమృత వ్యాఖ్యలతో సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యే విధంగా ఆలపించిన మహోన్నత గంధర్వ గాయకులని గాయకులు సంగ నర్సింహులు, బాలాజీ గౌడ్‌లు కొనియాడారు. గురువారం బాల కేంద్రంలో ఘంటసాల 103వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి ఘంటసాలను స్మరిస్తు గీతాలు ఆలపించారు. ఆ తర్వాత చిన్నారులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వసంత్ కుమార్, జ్ఞానామృత పాల్గొన్నారు.

రోశయ్య సేవలు చిరస్మరణీయం

నారాయణపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్‌గా పని చేసిన కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో ఏర్పాటు చేసిన కొణిజేటి రోశయ్య చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా ఎన్నోసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారని, ఆ తర్వాత ముఖ్యమంత్రిగా పని చేసి రాష్ట్రాన్ని వినూత్న సంస్కరణలతో అభివృద్ధి చేశారని కొనియాడారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, కలెక్టరేట్ ఏవో శ్రీధర్, డీపీఆర్వో రషీద్, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదేవిధంగా, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డా.వినీత్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. రోశయ్య ప్రతిభ, సరళమైన జీవన విధానం ప్రజలకు ఆదర్శమని ఎస్పీ పేర్కొన్నారు. ఏఎస్పీ రియాజ్ హుల్‌హక్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల ప్రణాళికను సమర్పించాలి

» కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చతుర్వేది

నారాయణపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం కింద ఎంపిక చేయబడిన జిల్లాల నుంచి వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడం, పంట వైవిధ్యీకరణ, పంటల తీవ్రత పెరుగుదల, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, పంట కోత తరువాత నిల్వ, విలువ జోడింపును పెంచడం, నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపరచడం, దీర్ఘకాలిక, స్వల్ప కాలిక క్రెడిట్‌ను సులభతరం చేసే అంశాలకు సంబంధించి ఆయా జిల్లాల సమగ్ర అభివృద్ధి ప్రణాళికను వీలైనంత త్వరగా సమర్పించాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి దేవేస్ చతుర్వేది ఆదేశించారు. దేశంలో పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం కింద 100 జిల్లాలు ఎంపిక కాగా ఆయా జిల్లాల కలెక్టర్లతో గురువారం ఢిల్లీ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలో పంటల మార్పిడి కింద ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి ప్రతిపాదనలతో కూడిన ప్రణాళికను సిద్ధం చేశామని, అలాగే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో మొక్కజొన్న పంటల సాగుకు అవసరమైన చర్యలు చేపట్టామని, వీటితో పాటు మత్స్యశాఖ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో ఎక్వా పార్కు ఏర్పాటుకు ప్రణాళికను తయారు చేసినట్లు వివరించారు. ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, నోడల్ అధికారి సాయిబాబా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, ఎల్‌డీఎం విజయ్‌కుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్‌రెడ్డి, నాబార్డు ఏజీఎం షణ్ముఖచారి, నీటిపారుదల శాఖ ఈఈ బ్రహ్మానందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం

నారాయణపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్క ఎన్నికల సిబ్బందికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సిక్తా పట్నాయక్, జనరల్ అబ్జర్వర్ సీతాలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. పంచాయతీ ఎన్నికల ఫలితాల ప్రకటన నియమాలు, ఏకగ్రీవ స్థానాల్లో ఉప సర్పంచ్ ఎన్నిక, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు, నామినేషన్లపై వచ్చే ఫిర్యాదులు, తదితర అంశాల పట్ల ఎన్నికల కమిషనర్ రివ్యూ నిర్వహించారు. వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైన చోట ఉప సర్పంచ్ ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని, ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ స్థానాలకు సంబంధించి ఫలితాలు నిబంధనల ప్రకారం ప్రకటించాలని తెలిపారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. సమావేశంలో డీపీవో సుధాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్‌సుధాకర్, ఈడీఎస్‌సి కార్పొరేషన్ అబ్దుల్ ఖలీల్, డీపీఆర్‌వో రషీద్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

ఎన్నికల అధికారులకు సన్మానం



నిడ్జింతలో ఎన్నికల అధికారులను సన్మానిస్తున్న నాయకులు

కొత్తపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడ్జింత గ్రామస్థులు బుధవారం గ్రామ సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో సర్పంచ్‌ను ఎన్నుకోవడంపై అధికారులు గ్రామస్థులను అభినందించారు. ఎన్నికకు సహకరించిన ఆర్‌వో ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏఆర్వో రామకృష్ణతో పాటు, ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌ను గ్రామ ముఖ్య నాయకులు సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, విజయ్ కుమార్, బాల్‌రాజ్ తదితరులున్నారు.

ఆలయాల్లో దత్తాత్రేయ జయంత్యుత్సవాలు



యానగుందిలోని దత్తాత్రేయ ఆలయంలో నిర్వహించిన డోలారోహణంలో పాల్గొన్న మహిళా భక్తులు

నారాయణపేట/మక్తల్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం పలు దేవాలయాల్లో దత్త జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా డోలారోహణ వేడుకలు నిర్వహించారు. నారాయణపేట అవధూత నరసింహస్వామి మఠంలో ప్రత్యేక పూజలతో పాటు దత్తజయంతి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహించారు. మఠం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మర్గమ్మ మందిర్‌లో ప్రత్యేక పూజలు చేసి, దత్తాత్రేయ డోలారోహణం నిర్వహించారు. బ్రాహ్మణ్‌వాడీ దత్తాత్రేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. యానగుంది కొండ కింద దత్తాత్రేయ దేవాలయంలో ట్రస్ట్ కార్యదర్శి కృష్ణ కోర్‌వార్ నేతృత్వంలో ప్రత్యేక పూజలతో పాటు, మూడు రోజులుగా కొనసాగిన గురు చరిత్ర పారాయణం ముగిసింది. డోలారోహణం అనంతరం యజ్ఞంతో పాటు, మాతా మాణికేశ్వరి పాదుక పూజలు కొనసాగాయి. కార్యక్రమంలో మాతా భక్తులు పాల్గొన్నారు.

అదేవిధంగా, మక్తల్ మండలం కర్ని, మంథన్‌గోడ్ గ్రామాల్లోని మారుతి దత్త దేవాలయం, దత్త క్షేత్రంలో దత్త జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. పుర వీధుల గుండా దత్తాత్రేయస్వామి వారి విగ్రహాన్ని ఊరేగింపుగా పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం, మహా మంగళహారతి, దత్తాత్రేయస్వామి డోలాహరణ సేవ నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం చేపడుతామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



కోస్గి సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ నవీన్‌కుమార్

కోస్గి సబ్‌స్టేషన్ తనిఖీ

కోస్గి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోస్గి సబ్‌స్టేషన్‌ను నారాయణపేట విద్యుత్ శాఖ ఎస్‌ఈ నవీన్‌కుమార్ తనిఖీ చేశారు. ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఆ తర్వాత పట్టణంలో తిరుగుతూ వినియోగదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏడీ సుధారాణి, ఏఈ వెంకటేష్, లైన్‌మెన్లు ఉన్నారు.

పత్తి విక్రయానికి బారులు తీరిన వాహనాలు



మక్తల్ మండలం లింగంపల్లి సమీపంలో పత్తి మిల్లు వద్ద బారులు తీరిన వాహనాలు

నారాయణపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద గురువారం పత్తి వాహనాలు బారులు తీరాయి. పత్తిని వాహనాల్లో తీసుకొచ్చిన రైతులు ఉదయం నుంచి రాత్రి వరకు గంటల తరబడి నిరీక్షిస్తూ నానా పాట్లు పడుతున్నారు. కపాస్ యాప్‌లో నమోదు చేసుకున్న వారం రోజుల తర్వాత కూడా విక్రయానికి బారులు తీరాల్సి వస్తోందని వారు వాపోయారు.

ధాన్యంపై తొలగించని కవర్లు



పేట మండలం సింగారం చౌరస్తాలో వరి కుప్పలపై తొలగించని కవర్లు

నారాయణపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగారం చౌరస్తా సింగిల్ విండో కొనుగోలు కేంద్రం ఆవరణలో ధాన్యం మీద కప్పి ఉంచిన కవర్లు గురువారం దాకా తొలగించలేదు. బుధవారం సాయంత్రం చిరుజల్లులు కురియడంతో ధాన్యం తడవకుండా రైతులు వాటిపై కవర్లు కప్పి ఉంచారు. గురువారం ఆకాశం మేఘావృతం కావడం.. ఎండలు లేకపోవడంతో ధాన్యంపై కప్పిన కవర్లను రైతులు తొలగించలేదు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు నానా పాట్లు పడాల్సి వస్తోందని రైతులు వాపోయారు.